
ఇందిరానగర్ కాలనీకి మహర్దశ

- గవర్నర్ దత్తతకు రంగం సిద్ధం
- హర్షం వ్యక్తం చేస్తున్న స్థానికులు



ఖైరతాబాద్ ఇందిరానగర్ కాలనీ వ్యూ చిత్రం, 1965లో శంకుస్థాపన చేసిన శిలాఫలకం

ఖైరతాబాద్, సెప్టెంబర్ 26 (ఆంధ్రజ్యోతి): పేదల కోసం ప్రభుత్వం నిర్మించిన తొలి దశ ఇళ్లుగా చెప్పుకునే ఇందిరమ్మ ఇళ్లు నగరంలోనే ప్రాముఖ్యతను పొందాయి. ఖైరతాబాద్‌లో 1965లో దివంగత మాజీ ప్రధాని ఇందిరాగాంధీ కేంద్ర సమాచార, ప్రసార శాఖ మంత్రిగా ఉన్న సమయంలో స్లమ్ క్లియరెన్స్ స్కీమ్ కింద మున్సిపల్ కార్పొరేషన్ ఆఫ్ హైదరాబాద్ (ఎంసీహెచ్) ఆధ్వర్యంలో ఇళ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. బిర్లా ఫౌండేషన్ వారి హిందుస్థాన్ చారిటీ ట్రస్ట్ ఈ ఇళ్ల నిర్మాణం చేయగా 1971లో పేదలకు పంపిణీ చేశారు. ఖైరతాబాద్‌లో 18 బ్లాకుల్లో ఒక్కో బ్లాకులో 18 ఇళ్ల చొప్పున 324 ఇళ్లను అప్పటి ఇందిరాగాంధీ ప్రభుత్వం నిర్మించి పేదలకు అందించింది.

సదుపాయాల కల్పనే సమస్య..

దాదాపు 53 సంవత్సరాల క్రితం కట్టిన ఇందిరమ్మ ఇళ్లలో 324 మంది లబ్ధిదారులకు 32 గజాల విస్తీర్ణంలోని ఇళ్లను కేటాయించారు. కుటుంబాలు పెరగడంతో దాదాపు అందరూ ముందు, వెనక ఉన్న స్థలాలను ఆక్రమించుకొని నిర్మాణాలు చేపట్టారు. అప్పటి జనాభాకు అనుగుణంగా ఏర్పాటైన డ్రైనేజీ పైప్‌లైన్లపై భారం ఎక్కువవడం, రోడ్లపై రోడ్లు నిర్మించడంతో డ్రైనేజీ వ్యవస్థ కిందకు వచ్చి శిథిలమయ్యాయి. ఇక్కడ క్వార్టర్లపై అదనపు భారం వేస్తున్నారు లబ్ధిదారులు. క్వార్టర్లను జి ప్లస్ 2గా నిర్మించగా ఇప్పటికే కింది అంతస్తుల్లో ఉన్న వారు ముందు వెనక ఆక్రమించుకొని నిర్మాణాలు చేశారు. వీటి ఆధారంగా మొదటి, రెండో అంతస్తుల్లో ఉన్నవారు సైతం తమ నిర్మాణాలను ముందుకు విస్తరించారు.

ఆక్రమణలతో అందరికీ ఇబ్బందులే..

రెండో అంతస్తుల్లో ఉన్న చాలా మంది క్వార్టర్ల పైభాగంలో అదనంగా ఇళ్లను నిర్మించి వీటిపై అదనపు భారాన్ని మోపుతున్నారు. ఈ విషయమై ఎన్నో ఫిర్యాదులు వచ్చినా, అధికారులు స్పందించడంలేదు. ముందు, వెనక విస్తరించిన నిర్మాణాలకు తోడు చెట్ల పెంపకం, అరుగుల నిర్మాణాలు, చేయడంతో పాటు వాకిల్లను తమ ఆధీనంలో ఉంచుకోవడమే కాక వాటి ముందు ద్విచక్రవాహనాలను నిలిపి ఉంచడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. ఈ ఆక్రమణలతో చాలా మందికి గొడవలు జరిగి పోలీస్‌స్టేషన్లకు వెళ్లిన సంఘటనలు ఉన్నాయి. పలు చోట్ల రోడ్లు సరిగ్గా లేక స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు.

రాష్ట్ర గవర్నర్ దత్తత తీసుకుంటుండడంతో సమస్యలన్నీ పరిష్కారం దిశగా సాగుతాయనే నమ్మకాన్ని స్థానికులు వ్యక్తం చేస్తున్నారు. దీంతో పాటు ఇందిరానగర్ కాలనీలో చాలా మంది యువతకు ఉద్యోగాలు లేవు. యువతకు ఉద్యోగ కల్పన, మహిళలు స్వయం సమృద్ధితో ఎదిగేలా కృషి చేస్తే అభివృద్ధి చెందినట్లే భావిస్తారు ఇక్కడి ప్రజలు.



ఖైరతాబాద్ ఇందిరానగర్‌లో సమీక్షిస్తున్న గవర్నర్ కార్యదర్శి పల్లవి, పలు శాఖల అధికారులు

గవర్నర్ కార్యక్రమానికి ఏర్పాట్లు

ఖైరతాబాద్, సెప్టెంబర్ 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఖైరతాబాద్ ఇందిరానగర్ కాలనీని దత్తత తీసుకుంటున్న విషయాన్ని ప్రకటించేందుకు శుక్రవారం రానున్న సందర్భంగా రాజ్‌భవన్ అధికారులు ఏర్పాట్లు చేశారు. గురువారం గవర్నర్ కార్యదర్శి పల్లవితో పాటు జీహెచ్‌ఎంసీ, జలమండలి, ట్రాఫిక్, శాంతిభద్రతల పోలీసులు, విద్యుత్ శాఖ తదితర విభాగాల అధికారులు వారివారి పనులను సమీక్షించారు. గవర్నర్ ఉదయం 11 గంటలకు ఇందిరానగర్‌కు వస్తారని, ఆయనకు ప్రతి ఇంటి వద్ద ఎన్‌ఎస్‌ఎస్ వాలంటీర్లు ఉండి సహకరిస్తారని, మొదట కాలనీలో పర్యటించిన అనంతరం జరిగే కార్యక్రమంలో గవర్నర్ దత్తత తీసుకుంటున్నట్లు ప్రకటిస్తారని కార్యదర్శి పల్లవి తెలిపారు.


విద్యార్థులు తయారు చేసిన రేసింగ్ కారును ప్రారంభిస్తున్న మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి

వినూత్నంగా ఆలోచిస్తే మంచి అవకాశాలు

- మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

బంజారాహిల్స్, సెప్టెంబర్ 26 (ఆంధ్రజ్యోతి): విద్యార్థి దశ నుంచే క్రమశిక్షణ ఉంటే ఏ రంగంలోనైనా విజయం సాధించవచ్చని ఇరిగేషన్ శాఖామంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. గురువారం బంజారాహిల్స్‌లోని ముఫకంజా ఇంజనీరింగ్ కళాశాలలో జరిగిన విద్యార్థుల తరగతుల ప్రారంభోత్సవ ఒరియేంటేషన్ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి విద్యార్థులనుద్దేశించి ప్రసంగించారు. వినూత్నంగా ఆలోచించే విద్యార్థులకు మంచి అవకాశాలుంటాయని అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనకు కాలేజీ లైఫ్ తెలియదని తాను ఇంటర్ దశలోనే మిలిటరీ ట్రైనింగ్‌కు వెళ్లానని అన్నారు. ప్రపంచ వ్యాప్తంగా వివిధ కంపెనీల్లో ఉన్నతమైన స్థానాల్లో హైదరాబాద్ విద్యార్థులు ఉన్నారని ఇది ఎంతో గర్వకారణమని అన్నారు. యువత బాగా చదువుకొని ఉన్నత స్థానాలు అధిరోహించాలని ఆయన అన్నారు. ఈ సందర్భంగా సుప్ర 2024 కార్ రేసింగ్‌లో ముఫకంజా ఇంజనీరింగ్ కాలేజీ విద్యార్థులు తయారు చేసిన రేసింగ్ కారును ప్రారంభించి విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో సుల్తాన్ ఉల్ ఉలూం ఎడ్యుకేషనల్ సొసైటీ గౌరవ కార్యదర్శి జాఫర్ జావెద్, బోర్డు సభ్యుడు ఆమెర్ జావెద్, రిజిస్ట్రార్ నర్సింహరావు తదితరులు పాల్గొన్నారు.


మానసిక రోగిని కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్న సూపరింటెండెంట్ డాక్టర్ అనిత, లీగల్ సెల్ అడ్వైజర్ మంజుల తదితరులు

కుటుంబ సభ్యులకు మానసిక రోగిని అప్పగింత

ఎర్రగడ్డ, సెప్టెంబర్ 26 (ఆంధ్రజ్యోతి): ఎర్రగడ్డ మానసిక ఆస్పత్రిలో 9 సంవత్సరాలుగా ఉన్న మానసిక రోగిని గురువారం కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఆర్. అనిత తెలిపారు. రోగికి సంబంధించిన వివరాలను సూపరింటెండెంట్ వివరించారు. నిజామాబాద్‌కు చెందిన 50 సంవత్సరాల మానసిక రోగి 2015లో మానసిక వ్యాధితో ఆస్పత్రిలో చేరారని తెలిపారు. ఆస్పత్రి నిబంధనల ప్రకారం రోగి ఆరోగ్యం కుదుటపడగానే ఒకటి, రెండు సంవత్సరాల లోపల కుటుంబ సభ్యులకు అప్పగిస్తాము, కానీ నిజామాబాద్‌కు చెందిన ఈ రోగి ఆరోగ్యం కుదుటపడినా వారి కుటుంబ సభ్యులు ఆస్పత్రి నుంచి డిశ్చార్జి చేసుకుపోయేందుకు ఆసక్తి వ్యక్తం చేయలేదన్నారు. ఎన్నిసార్లు ఫోన్ చేసినా స్పందించలేదని ఆమె తెలిపారు. ఆస్పత్రి లీగల్ సెల్ అడ్వైజర్ మంజుల గౌర్‌ను సంప్రదించి విషయం తెలపగా ఆమె వారి కుటుంబ సభ్యులకు నచ్చజెప్పడంతో రోగి భర్త, తండ్రి గురువారం వచ్చి ఆమెను ఆస్పపత్రి నుంచి ఇంటికి తీసుకెళ్లారని సూపరింటెండెంట్ అనిత వివరించారు. కార్యక్రమంలో డాక్టర్ పూజిత, ఆస్పత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బల్కంపేటలో గుర్తు తెలియని వ్యక్తి మృతి



అమీర్‌పేట, సెప్టెంబర్ 26 (ఆంధ్రజ్యోతి): బల్కంపేట ప్రధాన రహదారి బ్లూస్టార్ హోటల్ సమీపంలో శుక్రవారం రాత్రి సుమారు(45) సంవత్సరాల వయస్సు కలిగిన ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. ఎస్ఐ అఖిల తెలిపిన వివరాల ప్రకారం... ఎక్కడి నుంచో వారం రోజుల క్రితం బల్కంపేటకు వచ్చిన గుర్తు తెలియని వ్యక్తి స్థానికంగా భిక్షాటన చేసుకుంటూ ఎల్లమ్మ ఆలయం పరిసరాల్లోని ఫుట్‌పాత్‌లపై రాత్రి వేళ నిద్రించేవాడు. శనివారం ఉదయం 10 గంటలు కావస్తున్న బ్లూస్టార్ హోటల్ సమీపంలోని ఫుట్‌పాత్‌పై అచేతనంగా పడి ఉండడాన్ని గమనించిన స్థానికులు తట్టి చూసారు. ఎంతకు లేవకపోవడంతో 100 నంబర్‌కు డయల్ చేసారు. వెంటనే సంఘటన స్థలానికి చేరుకున్న పోలీస్ సిబ్బంది. 108 అంబులెన్స్ రప్పించి పరీక్షించిచూడగా అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. శవ పంచనామ అనంతరం మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు.


ప్రమాణస్వీకారం చేస్తున్న జూబ్లీహిల్స్ పాస్టర్స్ ఫెలోషిప్ కమిటీ

క్రైస్తవులు సమాజానికి అండగా ఉంటారు

యూసుఫ్‌గూడ, సెప్టెంబర్ 26 (ఆంధ్రజ్యోతి): క్రైస్తవులు సమాజానికి అండగా ఉండటానికి ఎల్లప్పుడు సిద్ధంగా ఉంటారని, అందుకోసం వారికి కావాల్సిన సహకారాలు అందిస్తామని క్రిష్టియన్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ దీపక్ జాన్ అన్నారు. గురువారం రహ్మత్‌నగర్ ఎస్పీఆర్‌హిల్స్‌లోని పెనుయేలు ప్రార్థనా మందిరంలో జూబ్లీహిల్స్ పాస్టర్స్ ఫెలోషిప్ కమిటీ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా బిషప్ విల్సన్ సింగం, రెవరెండ్ ప్రసాద్ చౌదరి, అడ్వకేట్ సుధీర్ చాట్ల, రెవరెండ్ డాక్టర్ గొనె సాల్మన్ రాజుల ఆధ్వర్యంలో కొత్త కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కొత్త కమిటీ ఫౌండర్ కృపాసన్నిధి, అధ్యక్షుడు వై.వి.ప్రేమ్‌సాగర్, ప్రధాన కార్యదర్శి స్వామిదాస్, ఉపాధ్యక్షులుగా మోసెస్, ప్రభాకర్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా చిన్నారావును ఎన్నుకున్నారు.

హెడ్ కానిస్టేబుల్ అదృశ్యం

బంజారాహిల్స్, సెప్టెంబర్ 26 (ఆంధ్రజ్యోతి): మొదటి బెటాలియన్‌లో పనిచేస్తున్న హెడ్ కానిస్టేబుల్ అదృశ్యమయ్యాడు. యూసుఫ్‌గూడ పోలీస్ లైన్‌లో నివాసముండే వెంకటేశం మొదటి బెటాలియన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నాడు. అనారోగ్యం కారణంగా ఉద్యోగానికి ఆరు నెలల పాటు సెలవు పెట్టి చికిత్స తీసుకుంటున్నాడు. ఈ నెల 13న స్వగ్రామానికి వెళ్లి 19న తిరిగి హైదరాబాద్ వచ్చాడు. రెండు రోజుల క్రితం ఇంట్లో నుంచి బయటకువెళ్లి తిరిగి రాలేదు. అతని సెల్‌ఫోన్ కూడా స్విచ్చాఫ్‌లో ఉంది. అతని భార్య పవిత్ర ఫిర్యాదు మేరకు జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సూపర్ మార్కెట్‌లో నిషేధిత సిగరెట్ల విక్రయం

- నిర్వాహకుడి అరెస్ట్

బంజారాహిల్స్, సెప్టెంబర్ 26 (ఆంధ్రజ్యోతి): నిషేధిత సిగరెట్లు విక్రయిస్తున్న ఓ సూపర్ మార్కెట్ నిర్వాహకుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. కృష్ణానగర్‌లో సూపర్ మార్కెట్‌లో నిషేధిత సిగరెట్లు విక్రయిస్తున్నారని ఫిర్యాదు రావడంతో జూబ్లీహిల్స్ ఎస్ఐ సోమశేఖర్ సిబ్బందితో షాపులో తనిఖీ చేశారు. రూ. 24,210 విలువగల సిగరెట్లను స్వాధీనం చేసుకొని సూపర్ మార్కెట్ నిర్వాహకుడు యశ్వంత్ ఉపాధ్యాయను అదుపులోకి తీసుకున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

యశోద ఆస్పత్రి ఏజీఎం ఇంట్లో నగలు చోరీ

బంజారాహిల్స్, సెప్టెంబర్ 26 (ఆంధ్రజ్యోతి): కప్‌బోర్డులో పెట్టిన బంగారు ఆభరణాలు చోరీ అయ్యాయి. బంజారాహిల్స్ రోడ్డు నంబర్-14 నందినగర్‌లో ఓ అపార్ట్‌మెంట్‌లో నివసిస్తున్న మాజిద్ హబీబ్ ఖాన్ యశోద ఆస్పత్రిలో ఏజీఎంగా పనిచేస్తున్నారు. భార్యాభర్తలు ప్రతీరోజూ విధులకు వెళ్తూ తాళంచెవిని ఫ్లాట్ పై భాగంలో పెడతారు. ఈ నెల 23న విధులకు వెళ్లారు. తిరిగి ఇంటికి వచ్చేసరికి తలుపులు తెరిచి ఉన్నాయి. లోపలికి వెళ్లి కప్‌బోర్డులో చూడగా.. అందులో భద్రపరిచిన మూడు జతల బంగారు చెవి కమ్మలు, బంగారు ఉంగరంతో పాటు వెండి గిన్నె కనిపించలేదు. బాధితుల ఫిర్యాదు మేరకు బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


సభ్యత్వాన్ని అందజేస్తున్న బీజేపీ జాతీయ కార్యదర్శి అరవింద్ మీనన్, మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

తెలంగాణలో బీజేపీని బలోపేతం చేయాలి

- బీజేపీ జాతీయ కార్యదర్శి అరవింద్ మీనన్

బంజారాహిల్స్, సెప్టెంబర్ 26 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో బీజేపీని బలోపేతం చేసేందుకు పార్టీ శ్రేణులు కృషి చేయాలని బీజేపీ జాతీయ కార్యదర్శి అరవింద్ మీనన్ అన్నారు. ఖైరతాబాద్ నియోజకవర్గం జూబ్లీహిల్స్ డివిజన్ గౌతమ్‌నగర్ చౌరస్తాలో బీజేపీ సభ్యత్వ నమోదుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై సభ్యత్వాలను అందచేశారు. అనంతరం కార్యకర్తలతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా అధిక కార్యకర్తల బలం ఉన్న పార్టీగా బీజేపీ అగ్రస్థానంలో ఉందన్నారు. ఇప్పుడు ప్రజా మద్దతును కూడా భారీగా తీసుకునేందుకు పార్టీ ప్రణాళికలు చేపట్టిందని తెలిపారు. రాష్ట్రంలో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కోటికి పైగా సభ్యత్వాలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చింతల రామచంద్రారెడ్డి, సెంట్రల్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు డా.గౌతమ్ రావు, జిల్లా బీజేపీ ఇన్‌చార్జి వీరెల్లి చంద్రశేఖర్ నాయకులు భోజిరెడ్డి, బంగారం చంద్రశేఖర్, గడ్డం వెంకటస్వామి, కొత్త నీరజ, డివిజన్ బీజేపీ అధ్యక్షులు ముద్దంగుల శ్రీనివాస్, దండగుల శ్రీనివాస్, మైపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


డాన్ బాస్కో స్కూల్లో పోటీలను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ బాబా ఫసియుద్దీన్

యువత క్రీడలలో ఉన్నత శిఖరాలకు ఎదగాలి


ఎర్రగడ్డ, సెప్టెంబర్ 26 (ఆంధ్రజ్యోతి): యువత పట్టుదలతో క్రీడల్లో ఉన్నత శిఖరాలకు ఎదగాలని బోరబండ కార్పొరేటర్ మొహమ్మద్ బాబా ఫసియుద్దీన్ అన్నారు. గురువారం ఎర్రగడ్డలోని డాన్ బాస్కో స్కూల్లో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ హైదరాబాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఖైరతాబాద్, షేక్‌పేట్ జోన్ల టోర్నమెంట్ సెలక్షన్ కబడ్డీ, కోకో పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైదరాబాద్ ఫెడరేషన్ స్కూల్ గేమ్స్ ఆధ్వర్యంలో వివిధ రకాల పోటీలను నిర్వహిస్తూ యువతను ప్రోత్సాహపరుస్తుందని అన్నారు. యువకులు క్రీడలలో నామమాత్రంగా పాల్గొనకుండా ప్రవేశంతో పాటు ప్రావీణ్యత కూడా సాధిస్తేనే క్రీడల్లో రాణిస్తారన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఈవో ఎం శామ్యూల్ రాజ్, ఆర్గనైజేషన్ సెక్రటరి విశ్వేశ్వరరావు, డాన్ బాస్కో స్కూల్ నిర్వాహకులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఆశారాం బాపు అనుచరులు మమ్మల్ని బెదిరిస్తున్నారు

- ఆస్తిని కాజేసేందుకు కుట్ర చేస్తున్నారు

పంజాగుట్ట, సెప్టెంబర్ 26 (ఆంధ్రజ్యోతి): తమ కుటుంబం ఆధ్యాత్మిక గురువు అని చెప్పుకుంటున్న ఆశారాం బాపు భక్తులమని, అతని అనుచరులు తమ ఆస్తిని కాజేయడానికి ప్రయత్నిస్తున్నారని, వారి నుంచి తమకు ప్రాణహాని ఉందని వారి నుంచి రక్షణ కల్పించాలని హిమాయత్‌నగర్‌కు చెందిన బాధితుడు కున్వర్ నరేష్ సింగ్ ప్రభుత్వానికి, పోలీసులకు విజ్ఞప్తి చేశారు. గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన తన గోడును వెళ్లబోసుకున్నారు. తమకు హిమాయత్‌నగర్ ప్రధాన రహదారిలో 1326.42 గజాల స్థలం ఉందని అన్నారు. తన తండ్రి మోహన్ సింగ్ అనుమానాస్పద స్థితిలో కొంతకాలం క్రితం మృతి చెందారని అన్నారు. తమ స్థలంపై ఆశారాం బాపు కన్ను పడింది. ఆయన సూచనతో అభివృద్ధి పేరుతో 2008 సంవత్సరంలో బిప్రశాంత్ రెడ్డికి జీపీఏ చేశామని అన్నారు. ఆయన మరో సంస్థ లోటస్ గృహ ప్రైవేట్ లిమిటెడ్ డైరెక్టర్ కట్ట లక్ష్మీకాంత్, ఆశారాం ట్రస్ట్ వారిని భాగస్వాములుగా చేసుకుని గ్రౌండ్, నాలుగు అంతస్తులలో కమర్షియల్ భవనాన్ని నిర్మించారు. తమ వాటాగా వచ్చిన ఆస్తి ప్రస్తుతం తమ ఆధీనంలో ఉందని, మరో తొమ్మిది వేల ఎస్‌ఎఫ్‌టీ స్థలం సంబంధించిన ఆస్తి వివాదంలో ఉందని అన్నారు. రెండు సివిల్ కేసులు న్యాయస్థానంలో పెండింగ్‌లో ఉన్నాయని అన్నారు. తాను వాహనంలో వెళ్తుంటే వేరే వాహనంతో ఢీ కొట్టించారు. తన ప్రాణాలకు వారి వల్ల ముప్పు ఉందని ప్రభుత్వం తనకు రక్షణ కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

సీపీకి గణేశ్ ఉత్సవ కమిటీ ధన్యవాదాలు


సీపీ ఆనంద్‌కు ధన్యవాదాలు తెలుపుతున్న కమిటీ ప్రతినిధులు

ఖైరతాబాద్, సెప్టెంబర్ 26 (ఆంధ్రజ్యోతి): ఖైరతాబాద్‌లో గణేశ్ ఉత్సవాలను ఎలాంటి ఆటంకాలు లేకుండా భారీ బందోబస్తుతో సజావుగా నిర్వహించినందుకు పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్‌కు కమిటీ కృతజ్ఞతలు తెలిపింది. గురువారం ఆయనను ఖైరతాబాద్ శ్రీ గణేశ్ ఉత్సవ కమిటీ ప్రతినిధులు మహేష్ యాదవ్, చంద్రశేఖర్, వంశీ కృష్ణలు కలిసి ప్రసాదాలు అందజేసి లక్షలాది మంది భక్తులు సాఫీగా దర్శనం చేసుకోవడం, నిమజ్జనోత్సవంలో పాల్గొన్న అశేష జనవాహిని పాల్గొన్నా పకడ్బందీ బందోబస్తు చర్యలు చేపట్టడంపై హర్షం వ్యక్తం చేస్తూ కృతజ్ఞతలు తెలిపారు.



అవార్డును అందుకుంటున్న రేడియంట్ స్కూల్ చైర్మన్ అహ్మద్ షరీఫ్

రేడియంట్ పాఠశాలకు ఫీల్డ్ ఎడ్యుకేషన్ అవార్డు

బంజారాహిల్స్, సెప్టెంబర్ 26 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిగూడలోని రేడియంట్ హైస్కూల్‌కు ఫీల్డ్ ఎడ్యుకేషన్ కేటగిరిలో అవార్డు లభించింది. నగరంలోని ఓ హోటల్‌లో గురువారం డైనమిక్ స్కూల్స్-2024 అవార్డ్స్ కార్యక్రమంలో భాగంగా బెస్ట్ స్కూల్ ఇన్ ఫీల్డ్ ఎడ్యుకేషన్ కేటగిరిలో అవార్డును స్కూల్ చైర్మన్ అహ్మద్ షరీఫ్ అందుకున్నారు. అవార్డు తనలో మరింత బాధ్యతను పెంచిందని, ఉన్నతవిద్యతో పాటు విద్యార్థులు త్వర గా అర్థం చేసుకొనేలా కొత్త విధానాలను అమలు మరితం విస్తృతం చేస్తామన్నారు.

కరాటే పోటీలో ప్రియకు కాంస్య పతకం


ప్రియ

పంజాగుట్ట, సెప్టెంబర్ 26 (ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ హైదరాబాద్ ఆధ్వర్యంలో ఖైరతాబాద్, షేక్‌పేట్ జోన్ జోనల్ స్థాయి పోటీలు, సెలక్షన్స్ జరుగుతున్నాయి. గురువారం ఎల్బీ స్టేడియంలో నిర్వహించిన కరాటే పోటీలలో మధురానగర్‌లోని శ్రీనిధి విశ్వభారతి ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న ఎస్.ప్రియ అండర్-17 విభాగంలో కాంస్య పతాకాన్ని గెలుచుకుంది. ఈ సందర్భంగా ఆమెను పాఠశాల డైరెక్టర్ కొల్లి లక్ష్మణ్ రావు, ప్రిన్సిపాల్ గీత, వైస్ ప్రిన్సిపాల్స్ విమల, రాజేశ్వరి, ఉపాధ్యాయులు రావత్, సీమ, శ్రీనివాస్, రవి, మధు, పూర్ణిమ, లక్ష్మి, పిఈటీ రాజనర్స్ అభినందించారు.


విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చర్యలు

వెంగళరావునగర్, సెప్టెంబర్ 26 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చర్యలు తీసుకుంటున్నామని విద్యుత్ శాఖ కళ్యాణ్ నగర్ సెక్షన్ ఏఈ తిరుపతి రావు అన్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు మధురానగర్‌లో భారీ వృక్షాలు నేలకొరగడంతో విద్యుత్ సరఫరాలో అంతరాయం, లో వోల్టేజీ సమస్య ఏర్పడింది. స్థానికులు కాలనీ సంక్షేమ సమితి ప్రతినిధుల దృష్టికి సమస్యను తీసుకెళ్లారు. కొత్తగా ట్రాన్స్ ఫార్మర్ ఏర్పాటు చేయాలని సమితి ప్రతినిధులు అధికారులకు విజ్ఞప్తి చేశారు. దీనికి బంజారాహిల్స్ డివిజన్ డీఈ నరేందర్ రెడ్డి, అమీర్‌పేట ఏడీఈ ప్రేమ్ కుమార్‌లు స్పందించి లో వోల్టేజి సమస్య పరిష్కారానికి, నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయడానికి సి-బ్లాక్ లో 100 కేవీ విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్‌ను మంజూరు చేశారని కాలనీ సంక్షేమ సమితి అధ్యక్షుడు ఎం.ప్రతాప్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి కోడె సాంబశివరావులు తెలిపారు. గురువారం ఏఈ తిరుపతి రావు దగ్గర ఉండి సిబ్బంది సహాయంతో 100 కేవీ విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్‌ను ఏర్పాటు చేయించారు.


చాకలి ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న పీసీబీ ఉన్నతాధికారులు, సిబ్బంది

ఘనంగా చాకలి ఐలమ్మ జయంతి

హైదరాబాద్ సిటీ, సెప్టెంబర్ 26 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో వీరమహిళగా పేరుగాంచిన చాకలి ఐలమ్మ జయంతిని తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి ప్రధాన కార్యాలయంలో గురువారం ఘనంగా నిర్వహించారు. చాకలి ఐలమ్మ చిత్రపటానికి కార్యదర్శి జి.రవి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. నిజాం నిరంకుశ పాలన నుంచి తెలంగాణ విముక్తి కోసం చాకలి ఐలమ్మ వీరోచిత పోరాటం చేసిన చాకలి ఐలమ్మ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయారని కొనియాడారు. కార్యక్రమంలో పీసీబీ చీఫ్ ఇంజనీర్లు బి.రఘు, సత్యనారాయణ, సామాజిక శాస్త్రవేత్త ప్రసన్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.


చాకలి ఐలమ్మ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఫిలింనగర్ 18 బస్తీల సంక్షేమ సంఘం అధ్యక్షుడు మామిడి నర్సింగరావు, కాటూరి రమేష్ తదితరులు



చాకలి ఐలమ్మ జయంతిని పురస్కరించుకొని కృష్ణ కాంత్ పార్క్ వద్దగల ఆమె విగ్రహానికి పూలమాలలు సమర్పించి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు మహమ్మద్ మోసిన్ ఖురేషి, ఎర్ర కృష్ణ కుమార్, మొహమ్మద్ సర్దార్, గంటా మల్లేష్ తదితరులు. - ఎర్రగడ్డ, ఆంధ్రజ్యోతి


క్రీడాకారులను అభినందిస్తున్న టీపీసీసీ ప్రధాన కార్యదర్శి విజయారెడ్డి

యువతను క్రీడల్లో ప్రోత్సహించాలి: విజయారెడ్డి

బంజారాహిల్స్, సెప్టెంబర్ 26 (ఆంధ్రజ్యోతి): క్రీడల్లో యువతను ప్రోత్సహించాల్సిన బాధ్యత తల్లిదండ్రులు, ఉపాధ్యాయులపై ఉందని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి విజయారెడ్డి అన్నారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ హైదరాబాద్ ఆధ్వర్యంలో ఖైరతాబాద్, షేక్‌పేట్ జోనల్ టోర్నమెంట్, సెలక్షన్స్ కబడ్డీ, కోకో పోటీలు బోరబండలోని డాన్ బాస్కో స్కూల్లో జరిగాయి. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విజయారెడ్డి హాజరై క్రీడాకారులను అభినందించారు. అనంతరం పీజేఆర్ ఫౌండేషన్ టీషర్టులను అందచేశారు. ఈ సందర్భంగా విజయారెడ్డి మాట్లాడుతూ క్రీడల్లో ప్రతిభ చూపిస్తున్న వారిని ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుంటుందన్నారు.



ఫిలిం చాంబర్ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న బీజేవైఎం నాయకులు

ప్రకాశ్‌రాజ్ క్షమాపణ చెప్పాలి: బీజేవైఎం

బంజారాహిల్స్, సెప్టెంబర్ 26 (ఆంధ్రజ్యోతి): తిరుపతి లడ్డూపై అనుచిత వ్యాఖ్యలు చేసిన సినీ నటుడు ప్రకాశ్‌రాజ్ వెంటనే బహిరంగ క్షమాపణ చెప్పాలని బీజేవైఎం నాయకులు డిమాండ్ చేశారు. ప్రకాశ్‌రాజ్ వ్యాఖ్యలను నిరసిస్తూ గురువారం ఫిలింనగర్ ఫిలిం చాంబర్ వద్ద నిరసన ప్రదర్శన నిర్వహించారు. మా కార్యాలయంలో ఎదుట బైఠాయించి ప్రకాశ్‌రాజ్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం ప్రకాశ్‌రాజ్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతూ మా కార్యాలయ ఇన్‌చార్జికి వినతిపత్రం సమర్పించారు. బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు మహేందర్ మాట్లాడుతూ భక్తులు అత్యంత పవిత్రంగా భావించే లడ్డూ విషయంలో సినీ పరిశ్రమకు చెందిన వారు అవగాహన లేకుండా వ్యాఖ్యలు చేయడంపై మా అసోసియేషన్ నిషేధం పెట్టాలని కోరారు. ప్రకాశ్‌రాజ్‌తో ప్రజలకు క్షమాపణ చెప్పించాలని డిమాండ్ చేశారు.



పార్టీ నాయకులతో కలిసి మయూరి మార్గ్‌లో పర్యటిస్తున్న కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి బండి రమేష్

డివిజన్‌లోని సమస్యల పరిష్కారానికి కృషి

బేగంపేట, సెప్టెంబర్ 26 (ఆంధ్రజ్యోతి): బేగంపేట డివిజన్‌లో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి బండి రమేష్ పేర్కొన్నారు. గురువారం పార్టీ నాయకులతో కలిసి డివిజన్ పరిధిలోని శ్యామ్‌లాల్ బిల్డింగ్, ప్రకాశ్‌నగర్ ఎక్స్‌టెంక్షన్, మయూరి మార్గ్, అల్లంతోట బాయి ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా బస్తీలలో మురుగు పారుతుందని, రోడ్లు అధ్వానంగా మారాయని స్థానికులు బండి రమేష్ దృష్టికి తీసుకొచ్చారు. స్పందించిన ఆయన సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. వీలైనంత త్వరగా సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో నాయకులు విశాల్ సుధాం, రమేష్, రమాదేవి, హనిటోచర్ తదితరులు పాల్గొన్నారు.



మహిళలతో బీజేపీ సభ్యత్వాలు నమోదు చేయిస్తున్న కార్పొరేటర్ సుచిత్ర

జోరుగా బీజేపీ సభ్యత్వాల నమోదు

రాంగోపాల్‌పేట్, సెప్టెంబర్ 26 (ఆంధ్రజ్యోతి): భారతీయ జనతా పార్టీ (బీజేపీ)లో చేరి ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వానికి మద్దతుగా నిలవాలని రాంగోపాల్‌పేట్ కార్పొరేటర్ చీర సుచిత్ర పిలుపునిచ్చారు. గురువారం రాంగోపాల్‌పేట్ డివిజన్ పరిధిలోని బట్టల బజార్, జనరల్ బజార్, సుభాష్ రోడ్డు, ఘాస్ మండీ, జీరా, నల్లగుట్ట, చుట్టాల బస్తీ తదితర ప్రాంతాలలో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ చీర సుచిత్ర మాట్లాడుతూ బీజేపీ సభ్యత్వాల నమోదు జోరుగా సాగుందని, ప్రజల నుంచి ఊహించని మద్దతు లభిస్తున్నదని అన్నారు. కార్యక్రమంలో ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు చీర శ్రీకాంత్, డివిజన్ అధ్యక్షుడు ఆకుల ప్రతాప్, ప్రధాన కార్యదర్శి నరేష్, ఎస్సీ మోర్చా అధ్యక్షుడు ప్రసాద్, నాయకులు శ్రీనివాసులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పీడీఎస్‌యూ ఆల్ ఇండియా యూనివర్సిటీస్ కన్వీనర్ ఎస్. నాగేశ్వర్ రావు

పీడీఎస్‌యూ గోల్డెన్ జూబ్లీని పురస్కరించుకుని..

రాష్ట్రవ్యాప్తంగా 30 రోజులు స్ఫూర్తి మహాసభలు

తార్నాక, సెప్టెంబర్ 26 (ఆంధ్రజ్యోతి): ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం(పీడీఎస్‌యూ) గోల్డెన్ జూబ్లీని పురస్కరించుకుని రాష్ట్రవ్యాప్తంగా 30 రోజులపాటు స్ఫూర్తి మహాసభలను నిర్వహించాలని పీడీఎస్‌యూ ఆల్ ఇండియా యూనివర్సిటీస్ కన్వీనర్ ఎస్.నాగేశ్వర్‌రావు కోరారు. గురువారం ఓయూ ఆర్ట్స్ కాలేజీలోని న్యూసెమినార్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం ఆవిర్భవించి 50 ఏళ్లు పూర్తవుతున్న నేపథ్యంలో ఈ నెల 30 నుంచి వచ్చే నెల 30 వరకు రాష్ట్రవ్యాప్తంగా స్ఫూర్తి మహాసభలను నిర్వహిస్తున్నట్టు తెలిపారు. అమరవీరుల స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ ఉద్యమబాటలో నడవాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ విద్యార్థి నాయకులు రుక్మత్ పాషా, కోటేశ్వర్, ప్రశాంత్, సతీష్, వెంకటేశ్, అంజి, నరేష్, ధనుష్, భువన తదితరులు పాల్గొన్నారు.

బ్రిడ్జి కింద భవన నిర్మాణ వ్యర్థాలను తొలగించండి

చిలకలగూడ, సెప్టెంబర్ 26 (ఆంధ్రజ్యోతి): రోడ్ల పక్కన భవన నిర్మాణ వ్యర్థాలు వేయడంతో రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. మెట్టుగూడ నుంచి చిలకలగూడ మధ్య వారధిగా ఉన్న రైల్వే అండర్ బ్రిడ్జి కింద భవన నిర్మాణ వ్యర్థాలు పారబోశారు. అసలే ఇరుకుగా ఉన్న బ్రిడ్జి కింద వ్యర్థాలు వేయడంతో రాకపోకలకు ఇబ్బందులు తలెత్తున్నాయని, వెంటనే భవన నిర్మాణ వ్యర్థాలను తొలగించాలని వాహనదారులు, పాదచారులు కోరుతున్నారు.



బ్రిడ్జి కింద వేసిన భవన నిర్మాణ వ్యర్థాలు

కట్టమైసమ్మ ఆలయం వద్ద అన్నదానం

బౌద్ధనగర్, సెప్టెంబర్ 26 (ఆంధ్రజ్యోతి): చిలకలగూడ కట్టమైసమ్మ ఆలయం వద్ద గత ఎనిమిది రోజులగు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. గురువారం నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో ఆలయకమిటీ సభ్యులు దేవేందర్‌యాదవ్, ప్రధానార్చకుడు తిరుమాలాచార్యులు పాల్గొని ప్రజలకు అన్నదానం చేశారు. అక్టోబర్ రెండోతేదీ వరకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తామని వారు తెలిపారు.



అన్నదానం చేస్తున్న ఆలయకమిటీ సభ్యులు



నేషనల్ థర్మల్ పవర్ కార్పొరేషన్ (ఎన్టీపీసీ) ప్రతినిధులు గాంధీ ఆస్పత్రిలో గురువారం స్వచ్ఛత సేవా కార్యక్రమం నిర్వహించారు. ఎన్టీపీసీ జనరల్ మేనేజర్ పాణిగ్రాహి, రోహిత్ చబ్రా, సురేష్, వెంకటేష్, గాంధీ ఆస్పత్రి డిప్యూటీ సూపరింటెండెంట్ సునీల్‌కుమార్, సిబ్బంది పాల్గొని చెత్తను తొలగించారు.
- (అడ్డగుట్ట - ఆంధ్రజ్యోతి)

ఘనంగా చాకలి ఐలమ్మ జయంతి

● **నివాళులర్పించిన కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేశ్, వివిధ పార్టీల నాయకులు**

సికింద్రాబాద్/బౌద్ధనగర్, సెప్టెంబర్ 26 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు, వీర వనితి చాకలి ఐలమ్మ జయంతి వేడుకలు గురువారం లష్కర్‌లో ఘనంగా జరిగాయి. సికింద్రాబాద్, సనత్‌నగర్, కంటోన్మెంట్ నియోజకవర్గాల్లో జరిగిన వేడుకలలో ప్రజాప్రతినిధులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, రజక సంఘ ప్రతినిధులు ఐలమ్మ విగ్రహాలు, ఫొటోలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఐలమ్మ ధీరత్వాన్ని వారు కొనియాడారు. దోబీఘాట్‌లో ఐలమ్మ విగ్రహానికి కంటోన్మెంట్ ఎమ్మెల్యే ఎన్.శ్రీగణేశ్, కంటోన్మెంట్ పాలక మండలి మాజీ ఉపాధ్యక్షులు జంపన ప్రతాప్, జక్కుల మహేశ్వర్‌రెడ్డి, మాజీ సభ్యులు కె.పాండుయాదవ్, టీపీసీసీ కార్యదర్శి బొల్లు కిషన్, బీజేపీ ఓబీసీ సెల్ రాష్ట్ర నాయకుడు బాణుక మల్లికార్జున్, బోయినపల్లి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్లు టీఎస్.శ్రీనివాస్, ముప్పిడి గోపాల్, రజక సంఘం నాయకులు సత్యనారాయణ, శంకర్, కృష్ణ, శ్రీరామకృష్ణ, రాజు, గణేష్, బాల్‌రాజ్, మురళి, సోమయ్య తదితరులు పూలమాల వేసి నివాళులర్పించారు.

● బోయినపల్లిలో రజక సంఘం ఆధ్వర్యంలో ఐలమ్మ జయంతి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. జంపన ప్రతాప్, వి.ఆర్.ఆస్పత్రి అధినేత నందకిశోర్, రజక సంఘం అధ్యక్షుడు సత్యనారాయణ, నర్సింగ్‌రావు, యాదగిరి, బాలరాజు, మధు తదితరులు పాల్గొన్నారు.

● **పార్సిగుట్ట, సీతాఫల్‌మండిలలో..**

పార్సిగుట్ట అశోక్‌సేవా సంఘం వద్ద ఐలమ్మ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. రజక సంఘం సభ్యులు బాలయ్య, శ్రీను ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు పి.రవిప్రసాద్‌గౌడ్ ముఖ్యఅతిథిగా పాల్గొని చాకలి ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సికింద్రాబాద్ కన్వీనర్ కందాడి నాగేశ్వర రెడ్డి, అధికార ప్రతినిధి ప్రభుగుప్తా, నాయకులు సాయిదత్తు, అజయ్, భిక్షపతియాదవ్ తదితరులు పాల్గొన్నారు.



ధోబీఘాట్‌లో చాకలి ఐలమ్మ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేశ్

● సీతాఫల్‌మండిలో నిర్వహించారు. ఓబీసీ మోర్చా రాష్ట్ర కోశాధికారి ఆకారం రమేష్ ఆధ్వర్యంలో చత్రపతి శివాజీ విగ్రహం వద్ద నిర్వహించిన వేడుకల్లో బీజేపీ మహంకాళి సికింద్రాబాద్ జిల్లా ప్రధానకార్యదర్శి మేకల సారంగపాణి ముఖ్యఅతిథిగా పాల్గొని చాకలి ఐలమ్మ చిత్రపటం వద్ద పూలమాలలు వేసి నివాళుర్పించారు. ఈకార్యక్రమంలో ఉపాధ్యక్షుడు రాచమల్ల కృష్ణమూర్తి, సురేష్‌ముదిరాజ్, సురేందర్, డివిజన్ అధ్యక్షుడు అంబాల రాజేశ్వరరావు పాల్గొన్నారు.

ఐలమ్మ పోరాటం మహిళాశక్తికి స్ఫూర్తిదాయకం

హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో వీర మహిళగా పేరుగాంచిన చాకలి ఐలమ్మ జయంతిని తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి(టీజీపీసీబీ) ప్రధాన కార్యాలయంలో గురువారం ఘనంగా నిర్వహించారు. చాకలి ఐలమ్మ చిత్రపటానికి సభ్యకార్యదర్శి జి.రవి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. నిజాం నిరంకుశ పాలన నుంచి తెలంగాణ విముక్తి కోసం చాకలి ఐలమ్మ వీరోచిత పోరాటం చేసిన చాకలి ఐలమ్మ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయారని కొనియాడారు. వీరమాత ఐలమ్మ పోరాటస్ఫూర్తి మహిళాశక్తికి స్ఫూర్తిదాయకమని, వ్యవసాయ విప్లవాన్ని రగిలించిన అగ్నికణం ఐలమ్మ అని పేర్కొన్నారు. కార్యక్రమంలో పీసీబీ చీఫ్ ఇంజనీర్లు బి.రఘు, సత్యనారాయణ, సామాజిక శాస్త్రవేత్త ప్రసన్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.



ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న పీసీబీ ఉన్నతాధికారులు, సిబ్బంది



బోయినపల్లిలో చాకలి ఐలమ్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న జంపన ప్రతాప్



చాకలి ఐలమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు రవిప్రసాద్‌గౌడ్



సీతాఫల్‌మండిలో నివాళులర్పిస్తున్న బీజేపీ మహాకాళి జిల్లా ప్రధానకార్యదర్శి సారంగపాణి తదితరులు



కంటోన్మెంట్‌లో నివాళులర్పిస్తున్న టి.ఎన్.శ్రీనివాస్, సంతోష్ తదితరులు

ఎస్‌టీయూ సికింద్రాబాద్ మండల అధ్యక్షుడిగా హనుమంతు

రాంగోపాల్‌పేట్, సెప్టెంబర్ 26 (ఆంధ్రజ్యోతి): ఎస్‌టీయూ సికింద్రాబాద్ మండల అధ్యక్షుడిగా మోండా మార్కెట్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో తెలుగు స్కూల్ అసిస్టెంట్ (ఎస్ఏ)గా పనిచేస్తున్న హనుమంతు ప్రధాన కార్యదర్శిగా కళాసీగూడ ప్రభుత్వ ఉన్నత పాఠశాల గణిత శాస్త్ర స్కూల్ అసిస్టెంట్ రామకృష్ణను ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు. గురువారం కళాసీగూడ ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుల సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల నూతన కమిటీని ఎన్నుకొన్నారు. అనంతరం ప్రధానోపాధ్యాయుడు యాకూబ్ చారి, అధ్యక్షుడు హనుమంతు, ప్రధాన కార్యదర్శి రామకృష్ణను సన్మానించారు. ఎస్‌టీయూ జిల్లా అధ్యక్షుడు మహ్మద్ ఇఫ్తికారుద్దీన్, ప్రధాన కార్యదర్శి శ్రీరామ సాబ్బారావు తదితరులను పాఠశాల ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో జి.షద్రక్, భోపాల్, వెంకటేష్, శైలేందర్, సుమన్, ఎస్‌టీయూ నాయకులు పాల్గొన్నారు.



ఇఫ్తికారుద్దీన్‌ను సత్కరిస్తున్న ఎస్‌టీయూ బృందం

బహుజన బతుకమ్మ ఆటపాటలో భాగస్వాములు కావాలి



బహుజన బతుకమ్మ ఆటపాట పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపాల్ ప్రొ. ఝాన్సీ తదితరులు

తార్నాక, సెప్టెంబర్ 26 (ఆంధ్రజ్యోతి): బహుజన బతుకమ్మ ఆటాపాటలో భాగస్వాములు కావాలని పీడీఎస్‌యూ విజృంభణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అల్లూరి విజయ్ పిలుపునిచ్చారు. విజృంభణ ఆధ్వర్యంలో అక్టోబర్ 2 నుంచి 10వ తేదీ వరకు ఓయూ ఆర్ట్స్ కాలేజీలో 'బహుజన బతుకమ్మ ఆటపాట' నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన పోస్టరును గురువారం ఓయూలోని ఆంధ్ర మహిళ సభ కళాశాల ఆవరణలో ప్రిన్సిపాల్ ప్రొ. ఝాన్సీ, మహిళా అధ్యాపకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళలపై జరుగుతున్న అత్యాచారాలను నిరసిస్తూ, స్త్రీలు గౌరవంగా జీవించేలా 'బహుజన బతుకమ్మ ఆటా పాట కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో ఆంధ్ర మహిళ సభ కళాశాల ఉపాధ్యాయులు రాజ్యలక్ష్మి, రమ్యశ్రీ, విద్యార్థులు పాల్గొన్నారు.

● **ఎంబీబీఎస్ మొదటి సంవత్సరం ఫలితాలలో**

గాంధీ మెడికల్ కాలేజీ టాప్

అడ్డగుట్ట, సెప్టెంబర్ 26 (ఆంధ్రజ్యోతి): ఎంబీబీఎస్ మొదటి సంవత్సరం ఫలితాలలో గాంధీ మెడికల్ కాలేజీ టాప్‌లో నిలిచింది. 94 శాతం మంది విద్యార్థులు పాసయ్యారని కాలేజీ ప్రిన్సిపాల్ ఇందిరా తెలిపారు. మొదటి ఏడాది పరీక్షకు 250మంది హాజరు కాగా, 235 మంది పాసయ్యారని తెలిపారు. వారిలో 24 మంది డిస్టింక్షన్‌లో పాసయ్యారని ప్రిన్సిపాల్ సంతోషం వ్యక్తం చేశారు. 159 మంది వైద్య విద్యార్థులు ఫస్ట్‌క్లాస్, 52మంది సెకెండ్ క్లాస్‌లో పాసయ్యారన్నారు. ఫెయిల్ అయిన విద్యార్థులు త్వరలో జరిగే సప్లిమెంటరీ పరీక్షలకు సిద్ధం చేస్తున్నామని తెలిపారు. ఓవరాల్‌గా గాంధీ మెడికల్ కాలేజీ నుంచి మొత్తం 94 శాతం ఉత్తీర్ణత సాధించారన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి

● **చర్లపల్లి పారిశ్రామిక వాడలో సదస్సు**

● **30న చలో లేబర్ ఆఫీస్**

కుషాయిగూడ, సెప్టెంబర్ 26 (ఆంధ్రజ్యోతి): దోపిడీకి గురవుతున్న వలస కార్మికులకు, నాన్ పర్మినెంట్ కాంట్రాక్టు కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు సీఐటీయూ ప్రతినిధులు వెల్లడించారు. బుధవారం రాత్రి చర్లపల్లి పారిశ్రామికవాడలో జరిగిన సదస్సులో పలువురు వక్తలు మాట్లాడారు. 1979 అంతర్ రాష్ట్ర వలస కార్మికుల చట్టాన్ని అమలు చేస్తూ కనీస వేతనం రూ.26వేలు చెల్లించాలని, నిబంధనల మేరకు పని గంటలు, కనీస వసతులు కల్పించాలని, వైద్యం, రవాణా సౌకర్యం, వసతి, భోజన సౌకర్యాలు నాణ్యమైనవిగా ఉండేలా చూడాలని స్పష్టం చేశారు. సమస్యల పరిష్కారానికై ఈనెల 30న నిర్వహించ తలపెట్టిన చలో లేబర్ డిపార్ట్‌మెంట్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని వారు కోరారు. చర్లపల్లి ఇండస్ట్రియల్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షుడు బి.వి.సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సీఐటీయూ తెలంగాణ రాష్ట్ర కమిటీ ఉపాధ్యక్షుడు భూపాల్, చర్లపల్లి ప్రధాన కార్యదర్శి జి.శ్రీనివాసులు, జిల్లా కార్యదర్శి జె.చంద్రశేఖర్, నాయకులు జె.వెంకటేష్, టి.నరసింహ తదితరులు పాల్గొన్నారు.

ఫ్లెక్సీ కడుతూ కాలుజారి పడి ...

● **'గాంధీ'లో చికిత్స పొందుతున్న ఎన్టీఆర్ అభిమాని**

అడ్డగుట్ట, సెప్టెంబర్ 26 (ఆంధ్రజ్యోతి): సినిమా ఫ్లెక్సీ కడుతూ ప్రమాదవశాతు కాలుజారి కిందపడిన వ్యక్తి గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. వివరాలలోకి వెళితే.. సికింద్రాబాద్ రైల్ నిలయం అంబేద్కర్ బస్తీకి చెందిన రాజు(21) జూనియర్ ఎన్టీఆర్‌కు వీరాభిమాని. శుక్రవారం (నేడు) జూనియర్ ఎన్టీఆర్ నటించిన దేవర సినిమా విడుదల కానుంది. ఈ నేపథ్యంలో గత నెల రోజుల నుంచి వివిధ ప్రాంతాలలో సినిమాకు సంబంధించిన ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తున్నారు. గురువారం రాత్రి రైల్ నిలయం అంబేద్కర్ బస్తీలో భారీ ఫ్లెక్సీ కడుతుండగా ప్రమాదవశాత్తు కాలుజారి కిందపడ్డాడు. తలకు తీవ్రంగా గాయాలు కావడంతో రాజు స్పృహకోల్పోయాడు. గమనించిన స్నేహితులు, బస్తీవాసులు గాయపడిన రాజును గాంధీ ఆస్పత్రికి తరలించారు.



గాయపడిన రాజు

అడ్డగుట్ట వెంకట్‌నగర్ బస్తీలో సైకో హల్‌చల్

అడ్డగుట్ట, సెప్టెంబర్ 26 (ఆంధ్రజ్యోతి): అడ్డగుట్ట డివిజన్ వెంకట్‌నగర్ బస్తీలో సైకో హల్‌చల్ చేశాడు. బిల్డింగ్‌లపైకి ఎక్కి రాళ్లతో దాడి చేయడంతో పలువురి గాయాలయ్యాయి. తుకారాంగేట్ పోలీస్ స్టేషన్‌కు కూతవేటు దూరంలో ఉన్న వెంకట్‌నగర్ బస్తీలోకి గురువారం రాత్రి 9 గంటలకు గుర్తుతెలియని వ్యక్తి చొరబడ్డాడు. స్థానికంగా ఇళ్లు, బిల్డింగ్‌లపై ఎక్కి దారి వెంట వచ్చిపోతున్న వారిపై రాళ్లు విసిరివేశాడు. దాంతో బస్తీ వాసులు అందరు కలిసి అతడిని పట్టుకునేందుకు యత్నించినా సాధ్యం కాలేదు. సైకో ఒక భవనం నుంచి మరో భవనంపైకి దూకుతు కనిపించిన ఇటుకలు రాళ్లతో దాడిచేశాడు. ఎట్టకేలకు స్థానిక బస్తీవాసులు సైకోను పట్టుకుని దేహశుద్ధి చేశారు. అనంతరం తుకారాంగేట్ పోలీసులకు అప్పగించారు.





జీహెచ్ఎంసీ డిప్యూటీ మేయర్ ఆధ్వర్యంలో కార్పొరేటర్ల బృందం అసోం రాష్ట్రంలో పర్యటిస్తున్నది. అక్కడి నగర శుభ్రతపై ఈ బృందం అధ్యయనం చేయనుంది. గురువారం డిప్యూటీ మేయర్‌తో కలిసి అడ్డగుట్ట కార్పొరేటర్ లింగాని ప్రసన్నలక్ష్మి.. అసోం ముఖ్యమంత్రి హేమంత్ బిశ్వశర్మను మర్యాదపూర్వకంగా కలిశారు. అసోం రాష్ట్రంలో ప్రభుత్వం అమలు చేస్తున్న నూతన విధానాలు, సంక్షేమ పథకాలపై సీఎంతో చర్చించారు.
(అడ్డగుట్ట - ఆంధ్రజ్యోతి)



స్వాగతం పలుకుతున్న ఆటో యూనియన్ నేతలు

ఏఐటీయూసీ జాతీయ ఉపాధ్యక్షుడికి ఘన స్వాగతం

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, సెప్టెంబర్ 26 (ఆంధ్రజ్యోతి): ఇటీవల బెంగళూరులో ఎన్ఎఫ్ఐఆర్‌టీడబ్ల్యూ (ఏఐటీయూసీ) అనుబంధం 18వ జాతీయ మహాసభ జరిగాయి. ఏఐటీయూసీ జాతీయ ఉపాధ్యక్షుడిగా హైదరాబాద్‌కు చెందిన వెంకటేశం నియమితులయ్యారు. ఆయన గురువారం సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌కు వచ్చారు. ఆటోవర్కర్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉమర్ ఖాన్‌తోపాటు పలువురు నాయకులు ఘనంగా స్వాగతం పలికారు.

నేడు ఏఐఆర్ఆర్ఎఫ్ ఆవిర్భావ వేడుకలు

చిలకలగూడ, సెప్టెంబర్ 26 (ఆంధ్రజ్యోతి): ఆల్ ఇండియా రిటైర్డ్ రైల్వేమన్ ఫెడరేషన్ (ఏఐఆర్ఆర్ఎఫ్) 64వ ఆవిర్భావ వేడుకలను ఈ నెల 27న (శుక్రవారం) నిర్వహించనున్నారు. చిలకలగూడలోని ఫేడరేషన్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఏఐఆర్ఆర్ఎఫ్ అధ్యక్షుడు శ్రీధర్ మాట్లాడుతూ హైదారాబాద్ భవన్‌లోని గులిస్తాన్ ఆడిటోరియంలో శుక్రవారం ఉదయం 10.30 గంటలకు నిర్వహిస్తున్నామని తెలిపారు. ముఖ్య అతిథులుగా ప్రిన్సిపల్ చీఫ్ మెడికల్ డైరెక్టర్ డాక్టర్. సీకే వెంకటేశ్వర్లు, డీఆర్ఎం హైదరాబాద్ లోకేష్ విష్ణోయ్, గౌరవ అతిథిగా ఏఐఆర్ఆర్ఎఫ్ ప్రధాన కార్యదిర్శి అతార్‌సింగ్, ప్రత్యేక అతిథిగా వి.నాగేశ్వరరావు, మిమిక్రీ శ్రీనివాస్ హాజరవుతున్నట్టు తెలిపారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లు పూర్తి చేశామన్న ఆయన. రైల్వే పెన్షనర్ల సమస్యలు పరిష్కరించడంతోపాటు మెరుగైన వైద్య సదుపాయాల కల్పన చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు.

టీచర్ ఎక్సలెన్స్ అవార్డులకు ఆహ్వానం

● **వచ్చే నెల 5న ఉపాధ్యాయులకు సన్మానం**

అడ్డగుట్ట, సెప్టెంబర్ 26 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా హైద్రాబాద్‌లో అక్టోబరు 5న ఉపాధ్యాయులకు ఘనంగా సన్మానం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని శారద ఎడ్యుకేషనల్ సొసైటీ, సై లైఫ్ ఫౌండేషన్ ప్రతినిధులు తెలిపారు. ప్రభుత్వ ప్రైవేట్ విద్యాసంస్థలో పనిచేస్తున్న ఉపాధ్యాయులను ఆహ్వానించి వారికి 'టీచర్ ఎక్సలెన్స్ అవార్డు' అందజేసి, సన్మానం చేస్తామని అన్నారు. సంస్కృతి, క్రీడారంగాల్లో నైపుణ్యం కలిగిన టీచర్లను సన్మానిస్తున్నట్టు తెలిపారు. వివరాల కోసం 93929 37486 నంబర్‌కు ఫోన్ చేసి తెలుసుకోవాలని డాక్టర్ కమల మనోహర్, చైర్మన్ శారద ఎడ్యుకేషన్ సొసైటీ పసుపులేటి నరేంద్రస్వామి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు.

హనుమాన్ ఆలయ ఈవోగా జయంతి

అమీర్‌పేట, సెప్టెంబర్ 26 (ఆంధ్రజ్యోతి): అమీర్‌పేట హనుమాన్ ఆలయం కార్యనిర్వాణాధికారి(ఈవో)గా కె. జయంతి బాధ్యతలను స్వీకరించారు. ఇటీవల జరిగిన బదిలీల్లో ఇక్కడ విధులు నిర్వహిస్తున్న ఇన్‌చార్జి ఈవో విఠలయ్య స్థానంలో జయంతిని నియమిస్తూ దేవాదాయ శాఖ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. గురువారం ఆలయానికి వచ్చిన జయంతి, ఈవోగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భక్తులు, దేవస్థాన సిబ్బంది సహకారంతో అన్ని ఆలయాల్లో జరిగే ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తానని అన్నారు.



బాధ్యతలను స్వీకరించిన జయంతి

రైల్వేస్టేషన్‌లో గుర్తుతెలియని మృతదేహం

సికింద్రాబాద్ రైల్వేస్టేషన్, సెప్టెంబర్ 26 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో గుర్తుతెలియని మృతదేహం లభించింది. ప్లాట్‌ఫాం 9, 10 నెంబరు మధ్య వృద్ధుడు మృతిచెంది ఉన్నాడని గురువారం రైల్వే పోలీసులకు సమాచారం అందింది. వారు అక్కడికి మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రి మార్చూరీకి తలరించారు. మృతిచెందిన వ్యక్తి వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదు. అతడి వయస్సు 65 ఏళ్లు ఉంటుందని పోలీసులు తెలిపారు.



వృద్ధుడి మృతదేహం

బల్కంపేటలో గుర్తుతెలియని వ్యక్తి మృతి

అమీర్‌పేట, సెప్టెంబర్ 26(ఆంధ్రజ్యోతి): బల్కంపేట ప్రధాన రహదారి బ్లూస్టార్ హోటల్ సమీపంలో గుర్తుతెలియని మృతదేహం లభించింది. వివరాల్లోకి వెళితే... ఇతర ప్రాంతం నుంచి బల్కంపేటకు వచ్చిన గుర్తుతెలియని వ్యక్తి భిక్షాటన చేస్తూ, ఎల్లమ్మతల్లి ఆలయ పరిసరాల్లోని ఫుట్‌పాత్‌లపై నిద్రిస్తుండేవాడు. బుధవారం రాత్రి బ్లూస్టార్ హోటల్ సమీపంలోని ఫుట్‌పాత్‌పై పడుకున్నాడు. గురువారం ఉదయం 10 గంటలు కావస్తున్నా నిద్రలేవలేదు. గమనించిన స్థానికులు అతడిని ఎంత పిలిచినా పలకకపోవడంతో డయల్ 100కు ఫోన్ చేసి సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలానికి వచ్చిన 108 సిబ్బంది అతడిని పరీక్షించి చూడగా అప్పటికే మృతిచెందినట్టు నిర్ధారించారు. మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రి మార్చూరీకి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ అఖిల తెలిపారు.



ఫుట్‌పాత్‌పై మృతిచెందిన వ్యక్తి